క్లుప్తంగా

వాహనం ఢీకొని గేదెలు మృతి



గుంటూరు రూరల్: గుర్తుతెలియని వాహనం ఢీకొని రెండు గేదెలు మృతి చెందిన ఘటన మంగళవారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ నరేష్‌కుమార్ వివరాల ప్రకారం.. స్థానిక హైవేలోని వైజంక్షన్ సమీపంలో మంగళవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని రెండు గేదెలు తీవ్ర గాయాలతో మృతి చెందాయి. గేదెల యజమానులు నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని చెప్పారు. గేదెల విలువ రూ.2 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పాత బైక్ వదిలేసి.. స్కూటీ చోరీ

చేబ్రోలు: మండల కేంద్రంలో మంగళవారం ద్విచక్ర వాహనం చోరీ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందింది. చేబ్రోలు ప్రాంతానికి చెందిన రైతు వేణు తన స్కూటీని స్థానిక డాన్ బాస్కో స్కూల్ ఎదురుగా రహదారిపై నిలుపదల చేసి పొలానికి వెళ్లాడు. తిరిగి వచ్చే సరికి ద్విచక్ర వాహనం అదృశ్యమైంది. చోరీ చేసిన నిందితుడు తన పాత బైక్‌ను అక్కడ వదిలేసి స్కూటీని అపహరించుకుపోయినట్లు గుర్తించారు. జరిగిన ఘటనపై బాధితుడు చేబ్రోలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అవగాహన సంస్థ సభ్యుల అభినందనలు



లక్ష్మీపురం: చంద్రబాబు నాయుడు సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా అవగాహన సంస్థ ఓటర్ల చైతన్య సభ బృంద సభ్యులు మంగళవారం అభినందనలు తెలిపారు. అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేయనున్న కూటమి ప్రభుత్వానికి అభినందనలు తెలియజేస్తూ ఓటర్ల చైతన్య సభ బృందం ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, విశ్లేషకులు సింగరయ్య, మల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అమరావతి శంకుస్థాపన ప్రదేశంలో ప్రత్యేక పూజలు



తాడికొండ: ఉద్దండరాయునిపాలెంలోని అమరావతి శంకుస్థాపన ప్రదేశంలో మంగళవారం తాళ్ళాయపాలెం శైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామీజీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కూటమి గెలిచి అమరావతికి పూర్వ వైభవం రావాలని, పూజలు నిర్వహించినట్లు రైతులు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ జాతీయ ఉపాధ్యక్షులు మాధవ నాయుడు, రాష్ట్ర అఖిల భారత కన్వీనర్ రామకృష్ణ, పాల్గొన్నారు.

14న యూరియా బస్తాల వేలం

మేడికొండూరు: వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో యూరియా బస్తాల వేలం పాటను ఎరువుల విక్రయ లైసెన్సు ఉన్న వారు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి మన్నవ నాగరాజు మంగళవారం తెలిపారు. మేడికొండూరులోని జయలక్ష్మి జనరల్ స్టోర్స్‌లో వ్యవసాయ శాఖ అధికారులు 2018లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. అందులో నిల్వ, రికార్డుకు వ్యత్యాసం ఉండటంతో అధికారులు 130 యూరియా బస్తాలు సీజ్ చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 14న మేడికొండూరు సచివాలయం -2 రైతు భరోసా కేంద్రం బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు అధికారి నాగరాజు తెలిపారు. వేలం పాటలో పాల్గొనదలచిన వారు రూ.2 వేలు చెల్లించాలన్నారు. ఎరువు విక్రయ లైసెన్సు కలిగిన వారు పాల్గొనవచ్చు తెలిపారు.

అంతర పంటలతో అదనపు ఆదాయం

తాడేపల్లిరూరల్ : అనాదిగా మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధితో పాటు దుగ్గిరాల మండలంలో వాణిజ్య పంటలను రైతులు ఎక్కువగా పండిస్తున్నారు. పంట మార్పిడితో పాటు కొన్ని పంటల్లో అంతర పంటలను వేసి అదనపు ఆదాయాన్ని పొందుతున్నారు. ముఖ్యంగా అరటి పిలక సమయంలో వివిధ రకాల కూరగాయల మొక్కలతో పాటు తీగజాతి కూరగాయలు వేసి అరటి గెలలు వచ్చే లోపు రెండుసార్లు పంట ఆదాయాన్ని పొందుతారు. కొత్తగా గులాబి తోట వేసేవారు మొక్కల కొమ్మలను తొలగించే సమయంలో రైతులు అదనపు ఆదాయం కోసం కూరగాయ మొక్కలు వేయడంతో పాటు బంతిపూల మొక్కలు ఎక్కువగా వేస్తుంటారు. కరివేపాకు పండించే రైతులు చేనుకు చీడపీడ రాకుండా చుట్టూ వివిధ రకాల పశుగ్రాసాన్ని పెంచుతున్నారు. సపోట, జామ, బొప్పాయి వంటి పండ్ల తోటలు ఉన్న రైతులు మధ్యమధ్యలో కూరగాయలు పండించడం, ఎక్కువ శాతం రైతులు పశుగ్రాసం పెంచడం చేస్తున్నారు.

9 నెలల్లో రెండుసార్లు అంతర పంటలు

అరటితోట వేసిన రైతులు 9 నెలల్లో రెండుసార్లు అంతర పంటలు పండిస్తున్నారు. అరటిచెట్టు



అరటి తోటలో అంతర పంటగా వేసిన సొర పాదులు

ఏపుగా పెరిగే సమయానికి ఉన్న అంతర పంటను తొలగిస్తున్నారు. మరల పిలక కట్టే సమయంలో పొలం చదును చేసి పూలతోటలు ఏర్పాటు చేసుకుంటున్నారు. రైతులు సమయ పాలనను బట్టి ఒకసారి కూరగాయలు, మరోసారి పూల మొక్కలు వేసి ఆదాయాన్ని పొందుతున్నారు. అరటి పంట చేతికి వచ్చే సమయానికి రెండుసార్లు అంతర పంటలు పండితే రైతుకు దాదాపుగా పెట్టుబడిలో సగం డబ్బులు వస్తాయని రైతులు అంటున్నారు.

మునగ తోటలో పూలు, కూరగాయల మొక్కలు



మునగ విత్తనాలు నాటిన సమయంలో మొక్క మొలకెత్తిన వెంటనే కొత్తిమీర, కూరగాయల మొక్కలను పండిస్తున్నాను. లేని పక్షంలో చేమ లేదా బంతి వేస్తున్నా. పంట బాగా పండితే పెట్టిన పెట్టుబడి వస్తుంది. అంతర పంటలు పండించడం వల్ల నష్టం ఉండదు. ఎండాకాలం పొలాన్ని దున్నుకుని సేంద్రియ ఎరువులు వేస్తే రెండు పంటలు బాగా పండుతాయి.

–నాగిరెడ్డి, రైతు

మేనిఫెస్టో అమలుపై దృష్టి పెట్టాలి

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

లక్ష్మీపురం: రాష్ట్రంలో విజయం సాధించిన కూటమి ప్రభుత్వం మేనిఫెస్టో అమలుపై దృష్టి పెట్టాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. కొత్తపేటలోని మల్లయ్యలింగం భవన్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి విజయానికి అమరావతి ఉద్యమమే కీలకమన్నారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో గెలిచిన వాళ్లే రాజు, ఓడిన వాళ్లు కాలగర్భంలో కలిసిపోతారని అనుకోవడం తప్పు అని హితవు పలికారు. రాజధాని ఉద్యమం, విశాఖ ఉక్కు ఉద్యమం, కడప స్టీల్ ప్లాంట్ సాధన, ప్రత్యేక హోమీ అంశాల సాధన కోసం సీపీఐ పోరాటాలు చేసిందన్నారు. 400 సీట్లు ఒంటరిగా గెలిచి హ్యాట్రిక్ కొడతామన్న నరేంద్ర మోదీ పూర్తిగా వైఫల్యం చెందినట్లు విమర్శించారు. కాంగ్రెస్‌పార్టీ అన్ని రాష్ట్రాల్లో పొత్తులు కుదుర్చుకొని ఉన్నట్లయితే ఎన్డీయే ప్రభుత్వం ఓటమి చెందేదన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా కూటమి బలమైన ప్రతిపక్షంగా ఏర్పడడం శుభ పరిణామమన్నారు. మేనిఫెస్టోలో పెట్టిన అంశాలపై టీడీపీ ప్రభుత్వం ప్రత్యేకమైన శ్రద్ధ పెట్టాలని కోరారు. ఇప్పుడైనా ప్రత్యేక హోదా, విభజన హామీలు, అమరావతికి కావాల్సిన నిధులు, విశాఖలో రైల్వే జోన్, కడపలో స్టీల్ ఫ్యాక్టరీ సాధించేందుకు చంద్రబాబు కృషి చేయాలన్నారు. సీపీఐ నగర కార్యదర్శి కోటా మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు, పక్కన జంగాల అజయ్‌కుమార్

‘ఈ - ఆసుపత్రి’ పక్కాగా అమలు చేయాలి

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలో అమలవుతున్న ఈ–ఆసుపత్రికి మంచి పేరు తీసుకొచ్చేందుకు హౌస్ సర్జన్‌ల పాత్ర కీలకమని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ చెప్పారు. మంగళవారం జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో ఈ–ఆసుపత్రి అమలుపై సమీక్ష సమావేశం జరిగింది. సమావేశంలో డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో కంప్యూటరీకరణకు శ్రీకారం చుట్టిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ–ఆసుపత్రిని మరింతగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తోందన్నారు. ప్రతి పేషెంట్ రోగ సమాచారం కంప్యూటర్‌లో పొందు పర్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. దీనివల్ల రోగులకు సంబంధించిన సమాచారం కంప్యూటర్‌లలో నిక్షిప్తంగా ఉంటుందన్నారు. అవసరమైన సమయంలో రోగి తెలుసుకునేందుకు ఎంతో తోడ్పాటుగా ఉంటుందన్నారు. రోగి ఓపీ నెంబర్‌తో పాటు ల్యాబ్, ఎక్స్‌రే విభాగం వైద్య చికిత్స వంటి సమాచారం పూర్తిగా కంప్యూటరీకరణ చేసే విధంగా పని చేయాలన్నారు. అమెరికా, బ్రిటన్ వంటి దేశాల్లో పూర్తిగా పేపర్ రహితంగా ఉంటుందన్నారు. ఆ దేశాల సరసన మనం కూడా చేరుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్, డాక్టర్ ఝాన్సీ, డాక్టర్ వెంకట రమణ, ఈ–ఆసుపత్రి విభాగం మేనజర్ ప్రదీప్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ కిరణ్‌కుమార్, చిత్రంలో పలువురు వైద్యులు

తెనాలిలో కుండపోత వర్షం



తెనాలిఅర్బన్: తెనాలిలో మంగళవారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. ఉదయం నుంచి కొంత ఎండతీవ్రత ఉన్నా సాయంత్రం 4.30 సమయంలో ఒక్కసారిగా చల్లబడింది. అలాగే ఉరుములతో కూడిన వర్షం కురిసింది. సుమారు గంటకు పైగా వర్షం పడింది. దీంతో గంట పాటు జనజీవనం స్తంభించింది. రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. వర్షం కారణంగా పట్టణంలోని పలు రోడ్లు జలమయమయ్యాయి. వర్షం తగ్గిన కొద్దిసేపటికి వర్షపు నీరు మురుగు కాల్వల ద్వారా బయటకు వెళ్లిపోయింది. సాయంత్రం వేళ కావడంతో ఉద్యోగస్తులు వివిధ పనులు చేసుకునే వారు కొంత ఇబ్బంది పడ్డారు.

మలేరియా నిర్మూలనే ధ్యేయంగా పనిచేద్దాం

మలేరియా అధికారి సుబ్బరాయణం

ఫిరంగిపురం: మలేరియా నిర్మూలనే ధ్యేయంగా ఆరోగ్య సిబ్బంది పనిచేయాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టీఎంకే సుబ్బరాయణం అన్నారు. మండలంలోని నుదురుపాడు, ఫిరంగిపురం పీహెచ్‌సీలను ఆయన మంగళవారం పరిశీలించారు. ఆశా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సమతుల్యత సాధన కోసం మలేరియా వ్యతిరేక పోరాటాన్ని వేగవంతం చేయాలని కోరారు. ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ప్రతి గ్రామంలో ఆరోగ్య సిబ్బంది ప్రజలకు దోమల వల్ల వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తల గురించి అవగాహన కల్పించాలని సూచించారు. లక్ష్యానికి చేరువలో మలేరియా రహిత సమాజం అనే నినాదంతో ప్రతి ఒక్కరిని చైతన్యవంతులుగా చేయాలన్నారు. కార్యక్రమంలో సీసీ గణేష్, నుదురుపాడు, ఫిరంగిపురం పీహెచ్‌సీ వైద్యులు ఫరీనాబేగం, యానీ గ్రేస్, శ్వేత, పి. ఎస్తేరురాణి, సీహెచ్‌వోలు వెంకటలక్ష్మీ, వెంకటరమణ, పీహెచ్ఎన్ గాయత్రీదేవి, హెచ్‌వీ నూర్ ఖాజాబీ, అన్నమేరి, ఎంపీహెచ్ఏలు కె.సుదర్శన్‌రాజు, అబ్దుల్ రెహమాన్, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సుబ్బరాయణం

ఇబ్బందులకు గురవుతున్న బిల్డర్లు

నేరెడ్కో రాష్ట్ర కార్యదర్శి సీతారామయ్య

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగం అవలంబిస్తున్న పద్ధతుల ద్వారా బిల్డర్లు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొందని నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ క్యాపిటల్ జోన్ (నేరెడ్కో) రాష్ట్ర కార్యదర్శి సీతారామయ్య పేర్కొన్నారు. బందావన్ గార్డెన్స్ లోని ఓ హోటల్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ సమయంలో అనుమతులు ఇచ్చే విషయంలో, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్, మార్ట్ గేజ్ రిలీజ్ విషయంలో కూడా నెలల తరబడి పెండింగ్‌లో ఉండటంతో పాటు, వివిధ రకాల కొర్రీలు పెడుతూ ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. అనుమతుల మంజూరు విషయంలో టౌన్ ప్లానింగ్‌లో జరుగుతున్న వివిధ అంశాలపై విజిలెన్స్ ఎంక్వైరీ వేయాలని డిమాండ్ చేశారు. అసోసియేషన్ నాయకులు పి.నాగవంశీ, పీవీ మల్లికార్జునరావు, వై.దుర్గాప్రసాద్, ఎం.రాము, డి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీతారామయ్య

సీఎం ప్రమాణ స్వీకారం వీక్షించేందుకు ఏర్పాట్లు

వేమూరు: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకార ఘట్టాన్ని ప్రజలంతా వీక్షించేందుకు వీలుగా ప్రభుత్వం తరఫున ప్రత్యేక వీక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని ఎంపీడీవో శేషగిరిరావు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో పంచాయతీ పుర వేదిక వద్ద లైవ్ ద్వారా ప్రమాణ స్వీకారాన్ని చూపించడం జరుగుతుందని చెప్పారు. బలిజేపల్లి, చదలవాడ, చంపాడు, చావలి, జంపని, కుచ్చెళ్లపాడు, పెనుమర్రు, పెరవలి, పెరవలిపాలెం, వరహాపురం రైతు భరోసా కేంద్రాల వద్ద ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించవచ్చన్నారు. వెల్లబాడు, అబ్బనగూడవల్లి, బూతుమల్లి, కోడిపర్రు గ్రామ సచివాలయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కాకర్లమూడి, పోతుమర్రు రైతు భరోసా కేంద్రాల వద్ద పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం లైవ్ ప్రసారం చూపించడం జరుగుతుందని వెల్లడించారు.

20న దేవాలయ భూముల కౌలు వేలం

తాడేపల్లి రూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరం, కుంచనపల్లి, గుండిమెడ చిర్రావూరు గ్రామాల్లోని దేవస్థానాల మెట్ట భూములలో 3 సంవత్సరాలపాటు కౌలు చేసుకునేందుకు వేలంపాటను నిర్వహించనున్నారు. ఈ మేరకు కార్యనిర్వహణాధికారి పాశం అచ్చిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–27 కాలానికిగాను దేవదాయ, ధర్మాదాయ శాఖకు చెందిన ఈ భూమిలో కౌలు చేసుకునే హక్కును బహిరంగ వేలం ద్వారా ఈ నెల 20వ తేదీ ఆయా దేవస్థానాల్లో కేటాయించనున్నామని తెలిపారు.

వివరాలు..

- వడ్డేశ్వరం గ్రామ పరిధిలోని సర్వేనెం. 85/1, శ్రీ సీతారామాంజనేయ, తిరునారాయణ స్వామి వారి దేవస్థానాలకు చెందిన 2.64 మెట్ట భూమికి సంబంధించి లోగడ మక్తా రూ. 45 వేలు, రూ. 5 వేలు డిపాజిట్. వేలం పాట సదరు దేవస్థానంలో ఉదయం 9 గంటలకు జరుగుతుందని వెల్లడించారు.
- సర్వేనెం. 58/1, శ్రీ రుద్రేశ్వరస్వామి వారి దేవస్థానానికి చెందిన 0.66 బీడు భూమికి సంబంధించి రూ. వెయ్యి డిపాజిట్ కట్టాలి. వేలం పాట సదరు దేవాలయంలో 20వ తేదీన ఉదయం 10 గంటలకు జరుగుతుందని వివరించారు.
- కుంచనపల్లి గ్రామ పరిధిలోని సర్వేనెం. 91(ఓల్డ్ 15/ఎ)లో శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి వారి దేవస్థానానికి చెందిన 1.54 మెట్ట భూమికి సంబంధించి లోగడ మక్తా రూ. 26,500, రూ. 5 వేల డిపాజిట్. వేలం పాట సదరు గుడిలో ఉదయం 11 గంటలకు ఉంటుంది.
- గుండిమెడ గ్రామ పరిధిలోని సర్వేనెం. 298, శ్రీ వేణుగోపాల అండ్ ఆంజనేయస్వామి వారి దేవస్థానానికి చెందిన 6.13 మెట్ట భూమికి సంబంధించి లోగడ మక్తా రూ.2.21 లక్షలు, రూ. 10 వేల డిపాజిట్. వేలం పాటను దేవస్థాన ఆవరణలో మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహిస్తారు. చిర్రావూరు గ్రామ పరిధిలోని సర్వేనెం. 39, శ్రీ నాగేశ్వర స్వామి వారి దేవస్థానానికి చెందిన 4.14 మెట్ట భూమికి సంబంధించి లోగడ మక్తా. రూ.68 వేల, రూ. 5 వేల డిపాజిట్, వేలం పాట సదరు దేవస్థానంలో మధ్యాహ్నం 1 గంటలకు జరుగుతుందని వెల్లడించారు.

ఆసక్తి గల కౌలు రైతులు ఈ వేలం పాటలో పాల్గొనవచ్చునని, కాల పరిమితి లేదన్నారు. ఎట్టి నోటీసుతో నిమిత్తం లేకుండా సదరు భూమిని దేవస్థానం వారికి స్వాధీన పరచవలెనని, హెచ్చుపాటదారుడు ప్రతి సంవత్సరం ఏప్రిల్ 30వ తేదీ నాటికి ముందుగా కౌలు దేవస్థానమునకు చెల్లించవలెనని వివరించారు. వివరాలకు 97042 64004ను సంప్రదించవలెనని పాశం అచ్చిరెడ్డి ఆ ప్రకటనలో తెలియజేశారు.

ముగిసిన హనుమజ్జయంతి వేడుకలు

తెనాలి: స్థానిక షరాఫ్ బజార్‌లోని సువర్చల సమేత పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో వార్షిక హనుమాన్ జన్మదిన వేడుకలు, 16వ లక్ష హనుమాన్ చాలీసా పారాయణ ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం హనుమత్ గాయత్రి హోమం, హనుమాన్ చాలీసా ప్రతులకు విశేష అర్చన, పూర్ణాహుతి, సాయంత్రం ఊంజల్ సేవను నిర్వహించారు. పూర్ణాహుతి కార్యక్రమంలో దాతలు గుడివాడ బాలకృష్ణ దంపతులు పాల్గొన్నారు. ఆలయ వంశపారంపర్య అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి, కిరణ్, సురేష్, వైఖానస పండితులు నాగ మారుతి వైదిక క్రతువును ఆగమోక్తంగా నిర్వహించారు. ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త ములుకుట్ల విశ్వనాథ శర్మ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. హనుమాన్ చాలీసా పారాయణలో పలువురు మహిళా భక్తులు పాల్గొన్నారు. ఆలయ ఈవో అవుతు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వార్షిక హనుమాన్ జన్మదిన వేడుకల్లో భాగంగా మంగళవారం పూర్ణాహుతి, చాలీసా ప్రతులకు విశేష పూజలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. పంచముఖ ఆంజనేయ స్వామి సంకీర్తన బృందం, పంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తన సేవాసమితి సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల ఒకటో తేదీ నుంచి జరిగిన ఉత్సవాలకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు ఎస్‌బీ శివ, నిఖిల్ శాండిల్య, కౌన్సిలర్ పసుపులేటి త్రిమూర్తి, సంకీర్తన బృందం అధ్యక్షురాలు మూర్తి అనురాధ, సంకీర్తన సేవాసమితి సభ్యులు మూర్తి వెంకటేశ్వరరావు, మడుపల్లి చంద్రశేఖర్, గుంటి వెంకట్, దమ్మాల వెంకటేశ్వరరావు, ఆర్ సురేష్, ఎం.వెంకటేష్, బి.లీలాప్రసాద్, గోలి సోమశేఖర్, సభ్యులు పాల్గొన్నారు.



పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహిస్తున్న పండితులు

15న లోక్ అదాలత్‌పై సమీక్ష

రేపల్లె రూరల్: మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 29న మెగా లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కారానికి గానూ పట్టణంలోని కోర్టు హాలులో 15న డివిజన్‌లోని పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలతో పాటు కోర్టు కానిస్టేబుల్స్ సమావేశానికి విధిగా హాజరు కావాలన్నారు.

దుర్గమ్మ ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు



భవానీ మాత ఆలయంలో పూజల్లో భక్తులు

బాపట్ల: ఎస్ఎన్‌పీ అగ్రహారం వినుకోటవారి వీధిలో వేంచేసి యున్న శ్రీ ప్రసన్న దుర్గాభవానీ మాత ఆలయంలో 23వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేపట్టారు. ఉదయం అభిషేకాలు, గణపతి, సుబ్రహ్మణ్య, రుద్ర, నవగ్రహ, సుదర్శన, శాంతి హోమం జరిగింది. అనంతరం దుర్గా మల్లేశ్వర స్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి ఒక భక్తురాలు ముక్కెర (బంగారపు ముక్కుపుడక), మరొక భక్తురాలు వెండి పూలదండ సమర్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.

మనోహర్ సతీమణికి సన్మానం

తెనాలిఅర్బన్: కూటమి అభ్యర్థి నాదెండ్ల మనోహర్ విజయానికి కృషి చేసిన ఆయన సతీమణి డాక్టర్ మనోహరంను అంగలకుదురు గణేష్ యూత్ సభ్యులు మంగళవారం ఆమె నివాసంలో కలిసి అభినందనలు తెలియజేసి సన్మానించారు. ఈ సందర్భంగా గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి తెనాలి అసెంబ్లీ అభ్యర్థిగా నాదెండ్ల మనోహర్‌ను ప్రకటించిన నాటి నుంచి ఆయన సతీమణి ఎన్నికల ప్రచారాన్ని విజయవంతంగా నిర్వహించారని గుర్తు చేశారు. ఆయన విజయంలో ఆమె పాత్ర చాలా ఉందని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కనగాల నాగభూషణం, మంచమర్తి భాస్కరరావు, శంకర్‌నాయక్, మహేష్‌నాయక్, బిట్రా యుగంధర్, ఎలిషా, అంకరావు, వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ మనోహరంను సన్మానిస్తున్న గణేష్ యూత్ సభ్యులు

మూడు బుట్టల విధానాన్ని సక్రమంగా అమలు చేయండి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న

తెనాలిఅర్బన్: మూడు బుట్టల విధానాన్ని సక్రమంగా అమలు చేయాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. పట్టణంలోని 31వ వార్డులో మంగళవారం ఆయన పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలను చేశారు. ఇళ్లలో ఉత్పత్తి అయిన చెత్తను వేరు వేరుగా సేకరించాలన్నారు. అలాగే నూరు శాతం చెత్త సేకరణ జరగాలని చెప్పారు. ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని తెలిపారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.



మున్సిపల్ ఉద్యోగులకు సూచనలిస్తున్న కమిషనర్ శేషన్న

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ

తెనాలిఅర్బన్: అన్నదాత సుఖీభవ సంస్థ ఆధ్వర్యంలో బోసురోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద వేసవిలో ఏర్పాటు చేసిన చలివేంద్రం మంగళవారంతో ముగిసింది. మంగళవారం దాతల సహకారంతో మజ్జిగ, మంచినీరు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు కుర్రా శ్రీనివాసరావు, తుల్లిమిల్లి పోతురాజులు మాట్లాడుతూ చలివేంద్రం ఏర్పాటు చేసిన నాటి నుంచి అనేక మంది దాతలు ముందుకు వచ్చి సహాయ సహకారాలు అందించారని తెలిపారు. ఇప్పటి వరకు చలివేంద్ర నిర్వహణకు రూ.1.50 లక్షలు ఖర్చు అయిందని చెప్పారు. విద్యార్థులు అనేక మంది స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు కూడా విరాళాలు ఇచ్చినట్లు చెప్పారు. వారందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కొత్తగొర్ల శ్రీనివాసరావు, ఓలేటి వెంకట ప్రతాప్, జి.వి.నారాయణ, డి.సందీప్, వరప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.



చలివేంద్ర నిర్వహణకు సహకరించిన దాతలతో నిర్వాహకులు

ఖరీఫ్ సాగుకు రైతులను సిద్ధం చేయాలి

వ్యవసాయశాఖ ఏడీఏ అక్తర్ హుస్సేన్

రేపల్లె రూరల్: ఖరీఫ్ సాగుకు రైతులను సిద్ధం చేయాలని వ్యవసాయశాఖ రేపల్లె డివిజన్ ఏడీఏ అక్తర్ హుస్సేన్ సూచించారు. మార్కెట్ యార్డులో ‘సాగుకు సమాయత్తం’ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ సహాయ సంచాలకులు, ఎరువుల దుకాణాల యజమానులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సాగుకు ముందు ప్రతి రైతు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకునేలా చైతన్య పరచాలన్నారు. భూసార పరీక్షల ఆధారంగానే ఎరువులు, పురుగు మందులు వినియోగించాలని తెలిపారు. భాస్వరం ఎరువులను అన్ని పంటలలో దుక్కిలోనే వాడుకోవాలని చెప్పారు. పచ్చిరొట్ట ఎరువులైన జనుము, జీలుగ, పిల్లిపెసరతో భూసారం పెరుగుతుందన్నారు. వ్యవసాయ అధికారులు గ్రామాలలో తమ కార్యాలయాలలో అందుబాటులో ఉండి రైతులకు సలహాలు, సూచనలు అందించాలని ఆదేశించారు. రసాయనిక ఎరువుల వాడకంతో కలిగే అనర్థాలను రైతులకు వివరించి సాధ్యమైన ఎక్కువగా సేంద్రియ వ్యవసాయం చేసేలా చైతన్య పరచాలన్నారు. విత్తన శుద్ధి చేయటంతో కలిగే ఉపయోగాలు వివరించారు. పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బాపట్ల ఏవో ఆర్.విజయ్‌బాబు, రేపల్లె ఏవో వాగోలు బుష్, సహాయ సంచాలకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీఏ అక్తర్ హుస్సేన్

ముగిసిన వేసవి క్రీడా శిక్షణ శిబిరం



గుంటూరు ఎడ్యుకేషన్: పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో నెల రోజుల పాటు నిర్వహించిన వేసవి క్రీడా శిక్షణా శిబిరం మంగళవారం ముగిసింది. ఈసందర్భంగా వివిధ క్రీడాంశాల్లో శిక్షణ పొందిన విద్యార్థులకు కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం, ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్, వ్యాయామ అధ్యాపకుడు ఆర్. శివాజీ సర్టిఫికెట్లు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ భానుమురళీధర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి జేవీ సుధీర్‌కుమార్, అధ్యాపకులు ఆర్.జయల శైలజ, టి.సురేష్, పి.కుమార్ రాజా, పి.అప్పారావు, తాడికొండ పాఠశాల వ్యాయామ అధ్యాపకుడు జాగర్లమూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.